# నిట్టూర్పు



నర్మద, రంగారావులు కొత్త ఇంటికి మారి ఆనాటికి మూడురోజులైంది. ఆ దంపతులకి పెళ్ళైన పన్నెండేళ్ళకి పుట్టాడు సంజయ్. అందుకే కొడుకంటే అంత అపురూపం వాళ్ళకి. మధ్యతరగతి కుటుంబీకులు ఇవ్వగలిగిన సౌకర్యాలలో సమస్తం అందిస్తూ జాగ్రత్తగా పెంచుతున్నారు కొడుకుని.

ఆ ఊళ్ళో చాలా మంచిదని పేరు పొందిన స్కూల్లో చేర్చారు సంజయ్‌ని. పూర్వం ఉంటున్న ఇంటికి స్కూలు దూరం కావడంతో కొత్త ఇంటికి మారవలసి వచ్చింది. అద్దె ఇల్లన్న తరువాత కొన్ని అనుకూలతలు, కొన్ని అననుకూలతలూ సాధారణంగా ఉంటూనే ఉంటాయి. ఇల్లు ఊరు చివరైనా, రంగారావుకి ఆఫీసుకి దూరమైనా కూడా వాళ్ళు పెద్దగా పట్టించుకోలేదు. కొడుకు స్కూలు విషయానికి తప్ప ఇంకే విషయానికీ ప్రాముఖ్యతనివ్వలేదు.

మొదటి మూడు రోజులూ సామాను సర్దుకోవడంతో గడిచిపోయాయి. సంజయ్‌ని స్కూలుకి సాగనంపడానికి బయటకు వెళ్ళిన నర్మద ఇంటి చుట్టూ తేరిపార చూసింది కొత్త పరిచయాల కోసం. ఇళ్ళ మధ్యన దూరం ఎక్కువగా ఉండడం వలన ఆ ప్రాంతంలో జనసంచారం తక్కువే. సగం కట్టిన కట్టడాలే ఎక్కువగా ఉండడం వల్ల ఇరుగుపొరుగులలో పరిచయాల్పులు తటస్థపడలేదామెకు.

తీరిక సమయంలో కూడా ఇంట్లో సామాను సర్దుతూ, పేపరు చదువుతూ, టీవీ చూస్తూ, రేడియో వింటూ కాలం గడుపుతోంది. ఊరి చివర కావడంతో వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంటోంది. అంతకుముందు వాళ్ళు నివసించిన పరిసరాలకి భిన్నంగా ఉండడం వల్ల నర్మదకి చాలా ఒంటరితనం అన్పిస్తోంది.

"ఇలా అయితే సంజయ్ స్కూలు చదువు ధర్మమా అని నేను పూర్తిగా మూగదాన్నవ్వడం ఖాయం. మాటలు మరిచిన నాకు ఏ స్పీచ్ థెరపితోనో మళ్ళీ మాటలు నేర్పాల్సిన పరిస్థితి వచ్చినా విచిత్రం లేదు" అనేది నర్మద.

చుట్టు ప్రక్కల కొత్త పరిచయాలు పెంచుకోవాలని తరుచూ అంటున్న నర్మద మాటలకి ఆయన "పక్కింటి పిన్నిగార్లు, పెద్దమ్మగార్లా వంటి వరసలు కలిపే చుట్టాలకేం కరువులే?... ఇంకొక నెలాగితే నెమ్మదిగా బయలుదేరుతారు తాతమ్మల దగ్గర్నుంచి మనవల వరకూ. పాత ఇంటి దగ్గరైతే నీకన్నా పెద్దవాళ్ళు నిన్ను పెద్దమ్మ... అనో, అత్తయ్య... మామ్మగారు అనో పిలుస్తున్నారని నొచ్చుకునే దానివి. ఇప్పుడు ఎవరూ లేరని నొచ్చుకుంటున్నావ్... ఏమిటో మీ ఆడవాళ్ళు... మీ మనస్తత్వాలు!..." అనేవాడు కొంటెగా ఏడిపిస్తూ.

* * *

ఆ రోజు పూజ చేసుకుంటున్న నర్మదకి బిగ్గరగా డప్పుల చప్పుళ్ళు వినరావడంతో ఆమె మనస్సు పూజపై కేంద్రీకరించలేకపోయింది. ఏదో... అయిందనిపించేసి బయటకొచ్చి, కిటికీలోంచి చూసింది. ఆమెకేమీ కనిపించలేదు. కుతూహలంగా అనిపించి డాబాపైకి వెళ్ళి చూసింది. దూరంలో గుడిసెలు కనిపించాయి. దగ్గర్లో మురికివాడ ఒకటుందన్న మాట... అనుకుంది.

కొత్తగా కుదిరిన పనిమనిషి మునియమ్మ వస్తూండడం గమనించి డాబా దిగింది నర్మద.

తాముండేది 'పాండవపల్లె' అని చెప్తూ ఆ వైపు చూపించింది మునియమ్మ నర్మద ప్రశ్నకి

లక్ష్మీమాధవ్

జవాబుగా. డప్పుల చప్పుళ్ళ వివరాలూ చెప్పింది.

"మా పక్కీదిలో రామయ్య పోయాడు గద మ్మా... పాపం! నలభై ఏళ్ళు కూడా రాకుండానే నీళ్ళు సెల్లిపోయినయ్! ఆ నూకాలు ఏడుపు సూడ్డానిక్కాదండి. ముగ్గురాడ బిడ్డల్ని ఎట్టా గట్టె క్కిత్తాదో మరి..." మునియమ్మ వాళ్ళ కష్టాల పరంపర వర్ణించి చెప్తోంటే మనసు తరుక్కు పోయింది నర్మదకి.

ఎవరైనా పోతే వాళ్ళని అలా సకల లాంఛ నాలతో సాగనంపడం వాళ్ళ తెగలో ఆనవాయి తీఅట. చెప్తూ... చెప్తూనే పని ముగించుకొని వెళ్ళిపోయింది మునియమ్మ.

ఆమె వెళ్ళాక కూడా నర్మదకి ఆమె చెప్పిన విషయాలే మనసులో మెదిలి చాలా కలవర పరిచాయి. సాయంకాలం ఇంటికి వచ్చిన రం గారావు నర్మద దిగాలుగా ఉండడం గమనించి విషయం అడిగి తెలుసుకున్నాడు. భార్య మన సు మళ్ళించడానికి ఏవేవో విషయాలు చెప్పి నవ్వించాడు. కానీ మళ్ళీ డప్పుల చప్పుళ్ళు విన రావడంతో తిరిగి మొదటికొస్తోంది నర్మద మనసు.

"ఊళ్ళో ఎవరికేమైనా అమ్మకే బెంగ" అం టూ మితిమీరి తల్లిని ఆటపట్టిస్తున్న సంజయ్‌ని వారిస్తూ నర్మదని సమాధానపరిచాడు రంగా రావు.

తరువాత రోజు కూడా డప్పుల శబ్దాలు అలా వినిపిస్తూనే ఉన్నాయి. మరుసటి రోజు పనికి వచ్చిన మునియమ్మ చెప్పింది.


రామయ్య వైపు వారు, అతని భార్య వైపు వారు, చుట్టాలు – పక్కాలూ అంతా వాళ్ళ స్తోమతకి తగ్గట్టు సారెలు – లాంఛనాలూ తెచ్చి తమ తమ మర్యాదని, ప్రేమనీ తెలిపేవరకూ అంతిమయాత్ర జరపరట వాళ్ళ తెగలో.

ఈ తతంగాలు, ఆచారాలూ వింటూంటే నర్మదకి అంత దిగులులోనూ నవ్వు వచ్చింది. బ్రతికి ఉన్నప్పుడు తిండికి, బట్టకి, మందులకీ కూడా కటకట పడి ఉంటాడు రామయ్య. కానీ అతడి ప్రాణం పోయాక ఎన్ని పంచెల చాపులు! ఎన్ని పౌడర్లు! ఎన్ని అత్తర్లు?!... తరచి చూస్తే... కష్టసుఖాల్ని, జీవితాన్నీ పాలుపంచుకునే తోడు ని కోల్పోయిన నూకాలుకి ఇప్పుడు అర్థం లేని ఆచారాల పేరుతో బొట్టు, పూలు పెట్టుకొనే అర్హతని కూడా కోల్పోయేలా చేస్తున్న ఈ తంతు లు, తతంగాల కోసం ఈ భోజనాలు, మిగతా ఖర్చులు... వాటి వల్ల ఇంకా అప్పులు... మరి కాస్త లేమిని తేబోతున్న వాళ్ళ మూఢనమ్మ కాలు... నవ్వాలో విచారించాలో పాలుపోలేదు నర్మదకి.

* * *

వారం రోజులు గడిచాయి... మళ్ళీ డప్పుల చప్పుళ్ళు వినబడసాగాయి. మునియమ్మని ఏమిటని అడిగి... మళ్ళీ వాళ్ళ విషాద గాథ లన్నీ విని మనసు చెదురు చేసుకోలేక అరా తియ్యలేదు నర్మద. కానీ ఆమెకి దిగాలుగా ఉంది. బట్టలార వెయ్యడానికి డాబా మీదకి వెళ్ళిన నర్మదకి పెళ్లి ఊరేగింపు కనిపించింది. డప్పుల దబదబల మధ్య చెట్టాపట్టాలేసుకుని పసుపు బట్టలతో వెళ్తున్న జంట, మిగతా బంధు మిత్రులు కనిపించారు. మూడు ముళ్ళతో వా ళ్ళు కొత్తగా ఏర్పరుచుకున్న బంధాన్ని వాళ్ళ పెద్దలు అందరికీ చాటటానికి చేస్తున్న హం గామా చూసి సంబరపడుతున్నారు బంధు బలగం.

హమ్మయ్య... అని ఊపిరి పీల్చుకుంది నర్మద.




పాండవపల్లెలో అందరికీ అందుబాటులో ఉండి, పిలవగానే వచ్చి... వాళ్ళకున్న సంగీత, లయ పరిధితో అన్నిరకాలైన కార్యాలకు ఒకటే లాంటి రాగాలు – తాళాలతో వాయించే బాజాల వాళ్ళని చూసి అబ్బుర పడకుండా ఉండలేక పోయింది నర్మద.

“వాళ్ళు ఎంతటి వైరాగ్యాన్ని సంతరించుకుని ఇలా వాయిస్తున్నారో?!” అని కూడా అనుకుంది ఆమె.

వేదాలు, వేదాంతాలు ఎరిగిన యోగుల్లాగా – భక్తిని, వైరాగ్య తత్వాన్నీ బోధించే సంత్‌లు, సంగీతజ్ఞుల కంటే మిన్నగా కనిపించారామెకు వాళ్ళా సమయంలో.

ఒకటి రెండు నెలల్లో నర్మద కుటుంబానికి ఆ డప్పుల చప్పుళ్ళు అలవాటయ్యాయి. బాజాలకి ప్రాముఖ్యతతగ్గి, సున్నితత్వపు దిగులు తగ్గింది. వేసవి కాలం అయిపోవస్తోంది. కానీ ఎండలు మాత్రం బాగా ఎక్కువగానే ఉన్నాయి. నీటి ఎద్దడి తగ్గడం లేదు. ఉక్కబోత వల్ల నర్మద, రంగారావు, సంజయ్ డాబా మీద మంచాలు వేసుకుని పడుకుంటున్నారు.

వానల కోసం జనం పరితపిస్తున్నారు. రోజూ మళ్ళీ వరుసగా డప్పులు, నగారాల నినాదాలు చెవులు గింగుర్లెత్తిస్తున్నాయి. రాత్రంతా మరీ హోరుగా ఉంటోంది. లౌడ్ స్పీకర్లో చెవులు చిల్లులు పడేలా పాటలు.

“అమ్మోరికి జాతరలు, ఉత్సవాలు చేయిస్తున్నామ్మ, పాండవపల్లెలో వాళ్ళమంతా! వానలొస్తే పంటలకీ, నీటికీ ఎద్దడి ఉండదమ్మా! ధరలు కూడా తగ్గి మా బోటోళ్ళకి కాస్తంత మెతుకులు సరీగా దొరుకుతాయని రోజుకో వీధిలో ఊరేగింపు, పూజలు చేయిస్తున్నాం” అంది మునియమ్మ.

“చాలా ఖర్చువుతుందేమో... అంత డబ్బు ...?” సందేహంగా అడిగింది నర్మద.

మునియమ్మ ఉత్సాహంగా చెప్పడం మొద

లుపెట్టింది.

'మా గుడిసె మట్టిగోడలు, తాటాకు తీయిం చేసి, గట్టిగోడ కట్టించి పెంకేయిద్దామని నేనూ మా మామా రెండేళ్ళ నుంచి మా ఇద్దరి జీతా ల్లోంచీ మానకుండా చీటీ కడతున్నాం. ఆ డ బ్బు ఈ ఉత్సవాలకి ఖర్చెడదామని అనుకు న్నాం. అలాగే చేత్తన్నాం. అందరూ కలిసికట్టు గా ఉంటేనే గదమ్మా... ఇలాంటి పుణ్యకార్యాలు జరిగేది?" అంది మునియమ్మ. తమ కమ్యూ నిటీ కోసం తను చేతనైనంత చేస్తున్నానన్న సం తృప్తి మెరుస్తున్న ఆమె కళ్ళలో కొట్టొచ్చినట్లు కనిపించింది నర్మదకి.

ఇలా వరసగా మూడు వారాలు జరిగాయి ఊరేగింపులూ వగైరాలన్నీ. ఇంకా ఎంతమంది ఎన్ని ఆశలతో పోగుచేసుకున్న చిన్న, చితకా ఆదాయాలు, సేవింగ్స్ డబ్బులూ జాతరలకి కైంకర్యం అయ్యాయో, ఆహుతి చేసారోగానీ... చివరికి దేవతలే కరుణించారో, మరి... నైరుతి ఋతుపవనాలు దయదల్చి వీళ్ళ దిక్కుగా వీచా యోగానీ వానలు ప్రారంభమయ్యాయి. తరు చూ రోజూ వానలు పడసాగాయి.

కానీ... బాజాలు మాత్రం ఆగలేదు.

కృతజ్ఞతగా దేవికి తమ వినయం తెలుపు తూ మళ్ళీ పూజలు జరిపించారు పాండవపల్లె వాసులు.

*  *  *



తిరుపతిలో అక్టోబర్ 8న "పులికంటి సాహితీ సత్కృతి అవార్డును అందుకొంటున్న ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ శ్రీ వీరాజీ. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఛైర్మన్‌శ్రీ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పులికంటి దంపతులు అవార్డు గ్రహీతకి అయిదువేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు.

మూడు రోజుల నుంచి పగలూ - రాత్రీ కుంభవృష్టి కురుస్తూనే ఉంది. వార్తా పత్రికల్లోను, టీవీ, రేడియో వార్తల్లోనూ చెట్లు, ఇళ్లు పడి పోయినట్లు, జననష్టం జరిగి నట్లూ సమాచారాలు విన వస్తున్నాయి.

మునియమ్మ మూడు రోజులుగా పనికి రాలేదు.

"సరేలే పాపం...! ఏమి అవస్థలు పడుతోందో..." అనుకుని తనే పనులన్నీ చేసు కుంటోంది నర్మద.

నాలుగవ రోజున ఏడు స్తూ వచ్చింది మునియమ్మ.

"వాన ఎక్కువగా కురు స్తోంది గదమ్మా... ఇల్లంతా కారుతోంది కదా అని గోడ

వారగా అయితే తక్కువ నీరు పడతాయని ఆడ పండబెట్టినాను మా చంటిదాన్ని. గోడ వానలకి నానింది గామోలు! మొన్న సోమవారం గాలితో కలిసి జాస్తీగా వాన పడింది కదా... అప్పుడు గోడ కూలి, దాని కింద మా చిన్నది ఇరుక్కుని సచ్చిపోయిందమ్మా" అంటూ బావురుమంది. కుమిలి కుమిలి ఏడుస్తున్న మునియమ్మని అ సంకల్పితంగా అడిగింది నర్మద

"మొన్నటి దప్పుల చప్పుడు మీ ఇంటి లోనా?"

"అవునమ్మా... అప్పు సేసయినా సరే... అన్ని కార్యాలూ బాగా సేయాలన్నాడు నా మొగుడు. సంటిదంటే ఆడికి పంచపానాలు"

మునియమ్మ మాటలు వింటూ అచేత నంగా ఉండిపోయింది నర్మద. పిల్లను కోల్పో యిన ఆ మాతృహృదయం రోదిస్తున్న దృశ్యం హృదయవిదారకంగా ఉంది.

వానలు కురవలేదని దేవికి పూజలు జరి పించారు. తమ అవసరాలు కూడా పక్కన పెట్టి మరీ ఉత్సవాలు జరిపించారు. వానలు వచ్చా యి, ముంచెత్తాయి. కానీ... వానలు వాళ్ళ కష్టా లను గాని, ధరలను గానీ ఏ మాత్రమైనా తగ్గిం చగలిగాయా??? వర్షధారలే కష్టాల ధారలుగా మారాయి ఆ పల్లెలోని కష్టజీవుల పాలిట.

ఉత్సవాల పేరుతో తమ సమయాన్ని, ధనా న్ని, శక్తినీ వృధా చేస్తూ... శబ్ద కాలుష్యాన్ని పెంచుతూ... వాళ్ళు పెద్దగా లౌడ్‌స్పీకర్లలో వే స్తున్న పాటలను, దప్పుల చప్పుళ్ళనూ దేవి పెడచెవిన పెట్టి ఉదాసీనురాలైందా?

అంత జోరుగా మ్రోగిన దప్పుల చప్పుడు వల్ల వీళ్ళ కోరికలు బహుశా ఆమెకి సరిగా వినిపించక ఇలా జరిగిందా?

అన్నిటికీ వాళ్ళు పరిపాటిగా ఒకేలా మ్రోగించే డోలు దప్పులు విని కష్టం - సుఖం ఒకటేలే... వీళ్ళకి అనుకుందా ఆ భగవతి?

వానలను గురించిన పూజలకని వారు వెచ్చించిన ధనం ఉపయోగించి తమ ఇల్లు బాగు చేయించుకుంటే ఆ చిన్నారి అంతమ య్యేదా?

వారు కోరుకున్న వానలకే బలి అయిపో యింది ఆ లేత పిందె. బూరె బుగ్గలతో, మిల మిల మెరిసే కళ్ళతో ఆ పిల్ల ఆటలు కళ్ళల్లో మెదిలి నర్మద నయనాలు కూడా అశ్రువులతో నిండాయి. దీర్ఘంగా నిట్టూర్పు వదిలింది నర్మద.

భగవంతుని మీద భక్తి, నమ్మకాలు, సం స్కృతి సదాచారాల విలువలు తెలిసిన తమ లాంటి చదువుకున్న వాళ్ళు వాటిని ఎంత మేరకు అమలు పర్చాలన్న విచక్షణ, విశ్లేషణ, వివేకంతో మసలుకోగలరు. కానీ అస్తికత్వాన్ని బలహీనతగా తీసుకుని, మూఢనమ్మకాలను ప్రచారం చేస్తూ వాటిని తమ అనుకూలానికి ఉపయోగించుకునే అవసరవాదుల ప్రలోభా లకు లోనవుతూ, మూఢనమ్మకాల ఊబిలో కూ రుకుపోతూ తమ జీవితాలను వృధా చేసుకుం టున్న పామరులకు నచ్చజెప్పే ఓర్పు, శక్తి లేక ఉత్త ప్రేక్షకురాలిగా మాత్రమే మిగులుతున్నాను గదా... అని గిల్టీగా ఫీలై నిట్టూర్చింది నర్మద.

దేశ పురోగతికి అవరోధం అవుతున్న ఇ లాంటి వాటిని రూపుమాపాలన్న తపన ఉన్న ప్పటికీ, వాటిని కార్యరూపంలోకి తేలేకపోతున్న ఎందరో నర్మదలు చేయగలుగుతున్నది నిస్స హాయంగా చూస్తూ నిట్టూర్పులు విడవడం మాత్రమే. ●